# ఇల

ముకుందంతో నా పరిచయం ఇప్పటిది కాదు. స్కూల్లో ఇద్దరం కలిసి చదువుకున్నాం. వాడి చదువు పదో తరగతితో ఆగిపోయింది. నేను ఇంటరు వరకు చదువుకున్నాను. ఆ పైన చదవడానికి నాకు వీలు కాలేదు. ప్రభుత్వరంగ సంస్థలో కాంట్రాక్టరు కింద అటెండరుగా స్థిరపడిపోయాను. ఉద్యోగం నిలకడగానే ఉంటుంది. తీసేస్తారనే సమస్య ఉండదు. ఇంక్రిమెంట్లు ఉండవు. ప్రమోషన్లు ఉండవు.

ఎప్పటికయినా ఉద్యోగం పర్మనెంటు అవుతుందనే నమ్మకం లేదు. సెలవులుంటాయి. సంవత్సరంలో రెండు వారాల పాటు బ్రేక్ ఉంటుంది. ఇ.యస్.ఐ., ప్రావిడెంట్ ఫండ్ కోతలు పోను జీతం నెలకు అయిదు వేల అయిదు వందలు వస్తాయి. ఒంటరిగాడిని. చిన్న గది అద్దెకు తీసుకుని వంట చేసుకుంటాను. ఎంత కష్టమయినా కనీసం నెలకు వెయ్యి రూపాయలయినా నాన్నకు పంపిస్తూంటాను. నేనిక్కడ ఏదో పెద్ద ఉద్యోగం చేస్తున్నానని ఆయన అనుకుంటూ ఉంటాడు.

మా ఊరు వెళ్లిన ప్రతిసారి నేను చేస్తున్న ఉద్యోగం గురించి చెప్పాలని అనిపిస్తూ ఉంటుంది. చెప్పలేకపోతాను.

ముకుందం నాతోపాటు ఇక్కడకు వచ్చిన కొత్తలో అక్కడక్కడా చిన్నచిన్న పనులు చేశాడు. కొన్నాళ్లపాటు రేడియోలు, టి.వి.లు బాగుచేసే దుకాణాల్లో పనిచేసి ఏం నేర్చుకోకుండా మిగిలిపోయాడు. వాడిని తీసుకున్నవాళ్ల పనులు నేర్పే మాట అటుంచి గదులు ఊడ్పించడం, టీలు, టిఫిన్లు తెప్పించుకోవడం, వాళ్లు తిన్న గిన్నెలు, తాగిన గ్లాసులు కడిగిస్తూండేసరికి విసుగెత్తి బయటకు వచ్చి పాత పేపర్ల దుకాణం పెట్టాడు. అయిదు వందల పెట్టుబడికి నేను మూడు శాతం వడ్డీ మీద అయిదు వేలు తీసుకు వచ్చి ఇచ్చాను. వాడు తట్టుకోడానికి నెలా పదిహేను రోజులేమో పట్టింది.

అంత చిన్న వ్యాపారంలో ఎక్కువ డబ్బే కదులుతుంటుందని నాకు తెలియదు. ఊహించలేదు. ఆ తర్వాత వాడు పట్టిందల్లా బంగారమే అయింది.

రెండో నెల తిరగకుండానే నేనిచ్చిన డబ్బులు వడ్డీతో సహా తిరిగిచ్చేశాడు. మరో దుకాణం అద్దెకు తీసుకున్నాడు. ఉదయం నుండి సాయంత్రం వరకు కొన్న పాత దిన పత్రికలు, వార, మాస పత్రికలు, పుస్తకాలు, చిన్నా చితకా వస్తువులు ఒకటేవిటి ఎన్నో సాయంత్రం ఆరవుతూండగా మొదట్లో ఆటోలో మరొకరికి అమ్మేసేవాడు. ఆ తర్వాత డి.సి.యం. వేనులో వెళ్లేవి. ఇప్పుడు రెండు లారీలు పంపిస్తున్నాడు. ఇద్దరు పనివాళ్లను పెట్టుకున్నాడు.

సాయంత్రాలు నా పని కాగానే నా గదికి వెళ్లి గుడ్డలు మార్చుకుని ఆరింటికల్లా ముకుందం దగ్గరకు వెళ్లి కూర్చుంటాను. ఇద్దరం కబుర్లలో పడిపోయినప్పుడు సమయం తెలిసేది కాదు. వాడికీ పెళ్లి కాలేదు. నాకులా వంట చాతకాదు. ఏ మెస్ నుండో ప్లేటు మీల్సు పార్సెలు తెప్పించుకుంటాడు. అది అతనికి రెండు పూటలా వస్తుంది. మాకు బోరు కొట్టినప్పుడు రెండో ఆట సినిమాకు వెళ్తాంటాం.

నాకు పుస్తకాలంటే చాలా ఇష్టం. వాడు నా కోసం ఒక మంచి పని చేస్తూండేవాడు. తనకు వచ్చిన వార, మాస పత్రికలను తీసి



నాకోసం పక్కన పెట్టేవాడు. నాకు కాలక్షేపంగా ఉండేది. చదివి తిరిగి ఇచ్చేస్తుండేవాడిని.

ఒకసారి వాడిచ్చిన పాత మాస పత్రిక చదువుతోంటే అందులోంచి బాగా పాతబడి మడతలు పెట్టి ఉన్న కాయితం జారి పడింది. అందుకున్నాను. పాత కాయితంలా అనిపించి మడిచి గది మూలనున్న చెత్తబుట్టలో పడేలా విసిరేద్దామనుకున్నాను. ఎంచాతనో విసిరేయబుద్ధి కాలేదు. ఉత్తరంలా అనిపించింది. నాలుగు మడతలు పెట్టి ఉంది. మడతలు పడిన చోట అక్కడక్కడా చిరిగిపోయి ఉంది. దాన్ని ఎన్నోసార్లు చదివినట్టు తెల్ల కాయితం తెల్లగా లేదు. మాసిపోయినట్టు ఉంది. మడతలు జాగ్రత్తగా విప్పాను.

అది పెద్ద ఉత్తరమేమీ కాదు. ఒకరి ఉత్తరం చదవడం సభ్యత కాదని తెలుసు. తిరిగి మడిచాను. అది ఎప్పటినుండో భద్రంగా దాచుకున్న ఉత్తరంలా అనిపించింది. ఆసక్తిని చంపుకోలేకపోయాను. మాసపత్రిక మీద పేరు కాని, చిరునామా ఉంటుందేమోనని చూశాను. ఏమీ లేవు. అందులో ఇలా ఉంది:

“చిరంజీవి సౌభాగ్యవతి లలితకు,

నా పేరు రాజారావు. మీ నాన్నగారి స్నేహితుడిని. నీకు తెలిసి ఉండకపోవచ్చు. మీ అన్నయ్యకు నేను బాగా తెలుసు. మీ అన్నయ్యకు కూడా ఉత్తరం రాస్తున్నాను. ప్రతి రోజూ సాయంత్రం నేనూ మీ నాన్నగారూ మరో ముగ్గురు మిత్రులం అలా యూనివర్సిటీలోకి వెళ్లి పార్కులో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్లం. మీ ఇద్దరూ దూరాన ఉండిపోయినా ఎప్పుడూ మీ గురించే మాతో గొప్పగా చెబుతూండేవాడు. చెబుతున్నప్పుడు ఎంతో గర్వంగా ఫీలయ్యేవాడు.

గమ్మత్తేమిటంటే పాపా, సరిగ్గా మీ అమ్మగారు చనిపోయిన పదిహేను సంవత్సరాల తర్వాత దాదాపు అదే సమయాన తీవ్రంగా గుండె నొప్పి వచ్చింది. తట్టుకోలేకపోయాడు. వైద్య సహాయం అందే వరకు ఆగలేదు. ఇవేళ్టికి ఆయన చనిపోయి పన్నెండు రోజులు అయ్యాయి. అన్ని ఏర్పాట్లు ముందే చేసుకున్నట్లుంది, మీ అనుమతులు కూడా తీసుకున్నాడనుకుంటాను. కంటి ఆస్పత్రి వాళ్లు వచ్చి కళ్లు తీసుకు వెళ్లిపోయారు. గాంధీ ఆస్పత్రి వాళ్లు శరీరాన్ని తీసుకువెళ్లారు.

వీలునామా నకలు పంపిస్తున్నాను. అసలు, మీ ఫిక్సిడ్ డిపాజిట్ పుస్తకాలు, ఇంటికి సంబంధించిన కాయితాలు, తాళాలు మీ చిన్నాయన దగ్గరున్నాయి. అతని నుండి మీకు ఉత్తరం అంది ఉంటుంది.

నీ దగ్గర నుండి వచ్చాకే మనిషి డీలా అయ్యాడు. రెండు రోజుల్లో చనిపోతాడనగా నాతో ఏమన్నాడంటే మీ ఇంటి నుండి అప్పుడప్పుడు నాకు ఫోన్లు చేస్తున్నందుకు నువ్వో, మీ ఆయనో ఎస్.టి.డి. బిల్లు ఎక్కువవుతుందని అరగంట పాటు ఆయన మీద అరిచారని చెప్పి బాధపడ్డాడు. బిల్లు ఎంతయి ఉంటుందో తెలియదు. అయిదు వేలకు చెక్కు పంపించమన్నాడు. ఇందులో జత చేశాను. మీ కోసం ఎంతో కష్టపడి, తనే తండ్రి, తల్లి అయి పెంచి మిమ్మల్ని పెద్ద చేసిన మీ నాన్న తనకంటూ ఏమీ మిగుల్చుకోలేదమ్మా... ఆశీస్సులతో”.

కింద సంతకం లేదు. ఊరు పేరు లేదు. ఏ ఊరయినా అయి ఉండొచ్చు. కాలం తినేసినట్టు తేదీ స్పష్టంగా కనిపించడం లేదు.

**- బి.పి.కరుణాకర్**